నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 22 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లకు దరఖాస్తులు

రామగిరి, ఆగస్టు 21 : డాక్టర్ బీఆర్ అంబేదర్క్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సులో అడ్మిషన్లకు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ నల్లగొండ ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ అంతటి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, బీఎల్ఐసీ, ఎంఎల్ఐసీతోపాటు పీజీ డిప్లొమో సర్టిఫికెట్ కోర్సులకు అవకాశం ఉందని పేర్కొన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరంతో పాటు పీజీ ద్వితీయ సంవత్సరం అభ్యర్థులు కూడా ఆయా కోర్సుల ఫీజులను ఇదే గడువులోగా చెల్లించాలని తెలిపారు. అడ్మిషన్లు, ఇతర వివరాలకు www.braouonline.in, www.braou.ac.in లోగానీ 9533101295, 7989339180 నంబర్లలోగానీ సంప్రదించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కోర్సులకు నల్లగొండలోని ఎన్జీ కళాశాల, దేవరకొండ ఎంకేఆర్ కళాశాల, మిర్యాలగూడ కేఎన్ఎం కళాశాల, హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోదాడలోని కేఎన్ఎం, సూర్యాపేటలో ఎస్‌వీ కళాశాల, రామన్నపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నల్లగొండలో ఉమెన్స్ డిగ్రీ కళాశాల, పీజీ కోర్సులకు నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో అవకాశం ఉందని వివరించారు.


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

అన్నదాతకు అండగా బీఆర్ఎస్ రణం

అర్హులందరికీ రుణమాఫీ కోసం పోరుబాట

- నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలకు సన్నద్ధం
- నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలకు ఏర్పాట్లు
- పెద్దఎత్తున పాల్గొనేందుకు సిద్ధమవుతున్న రైతులు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిశానిర్దేశం

అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ మాఫీ అవ్వక తీవ్ర అవస్థలు పడుతున్న రైతాంగానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తున్నది. కొర్రీలు లేకుండా రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధమైంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులతో కలిసి ధర్నాలు చేసేందుకు గులాబీ శ్రేణులు సన్నద్ధం అవుతున్నాయి. నియోజకవర్గ కేంద్రాల్లోని ఆర్డీఓ కార్యాలయాలు లేదా తాసీల్దార్ ఆఫీసుల ఎదుట రుణమాఫీ అందరికీ ఇవ్వాలన్న నినాదంతో పెద్దఎత్తున నిరసన తెలిపేందుకు సన్నాహాకాలు పూర్తయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి జరిగే ధర్నాలో రైతులకు మద్దతుగా ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు గ్రామ స్థాయి వరకు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. వాస్తవానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాకపోవడం శోచనీయం.

– నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ)

ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన విధంగా పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ అమలు చేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6 లక్షల మంది వరకు లబ్ధిదారులు ఉంటారన్నది అంచనా. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డును ప్రమాణికంగా తీసుకుని కుటుంబంలో ఒక్కరికే రెండు లక్షల రుణమాఫీ వర్తింప చేయడంతో దాదాపు రెండున్నర లక్షల మంది రుణమాఫీకి దూరమైనట్లు రైతు సంఘాల లెక్కలు చెప్తున్నాయి. ఇందుకు ఆధారంగా గతేడాది ఆగస్టులో కేసీఆర్ సర్కార్ చేసిన రుణమాఫీ లెక్కలను ముందు పెడుతున్నాయి. 2018 ఎన్నికల హామీలో భాగంగా కేసీఆర్ సర్కార్ 2023 ఆగస్టులో పాస్‌పుస్తకమే ప్రమాణికంగా రుణమాఫీ చేసింది. కేసీఆర్ పాలనలో రూ.99,999 వరకు అమలు చేస్తేనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4,00,518 మంది రైతులకు మొత్తం రూ.2159.77 కోట్ల రుణమాఫీ జరిగింది. ప్రస్తుతం రేవంత్ సర్కార్ రూ.2లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించినా రైతుల సంఖ్య తగ్గడం గమనార్హం. ఇప్పుడు మూడు విడతల్లో కలిపినా 3.39 లక్షల మంది రైతులకే లబ్ధి జరిగింది. కేసీఆర్ హయాంలో లక్షలోపు రుణమాఫీ ఉన్న రైతుల సంఖ్య కంటే ఇది 60 వేలు తక్కువ. 2 లక్షల రుణమాఫీ అన్నాక అంతకు రెట్టింపు స్థాయిలో రైతులకు లబ్ధి జరుగాల్సింది పోయి ఇంకా తగ్గడం చర్చనీయాంశంగా మారింది. ఇక నల్లగొండ డీసీసీబీలో 58 శాతం మంది రైతులకే రుణమాఫీ జరిగింది. డీసీసీబీ పరిధిలోని 107 సొసైటీల్లో రుణమాఫీకి అర్హులైన రైతులు 89,888 మంది ఉండగా ఇందులో రెండు లక్షల రుణమాఫీ అయిన రైతుల సంఖ్య 52,708 మాత్రమే. ఇంకా 37,180 మంది రుణమాఫీకి నోచలేదు. మొత్తం 499.98కోట్ల రుణాలకు గానూ రూ.279.76 కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. రూ.220.22 కోట్ల రుణాల మాఫీ గురించి నేటికీ స్పష్టత లేదు. ఆర్థిక భారం తగ్గించుకునేందుకే రుణమాఫీని మ.మ. అనిపించాలని కాంగ్రెస్ సర్కార్ కుట్రలు చేసిందని రైతులు మండిపడుతున్నారు. రేషన్ కార్డులో ఎంత మంది ఉన్నా ఒక కుటుంబంలో గరిష్టంగా రెండు లక్షల రుణమాఫీ మించవద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రేషన్‌కార్డు లేని వారిని ప్రస్తుతానికి పక్కన పెట్టింది. దీనికి తోడు ఆధార్ సీడింగ్ లేదా ఇతర సాంకేతిక సమస్యలు ఉన్న వారికి సైతం రుణమాఫీ కాలేదు. వారందరికీ ఎప్పుడు రుణమాఫీ వర్తింప చేస్తారన్నది ప్రశ్నార్థకంఆ మారింది. దాంతో బాధిత రైతులు నిత్యం బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. చెప్పులు అరిగేలా తిరుగుతున్నా ఎవరూ స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని, రుణమాఫీ కాకపోవడానికి కారణం చెప్పడం లేదని వాపోతున్నారు. సగం మందికి చేసి సగం మందిని దూరం పెట్టడం ఏంటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల ఆందోళనలకు దిగుతున్నారు. అందులో భాగంగా బీఆర్ఎస్ తలపెట్టిన రైతు ధర్నాల్లోనూ పెద్దసంఖ్యలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

నేటి ధర్నాకు తరలిరండి

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ సర్కార్ రైతులను దగా చేస్తున్నదని, రైతులంతా ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధం కావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింప చేయకుండా రకరకాల కొర్రీలతో కోతలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులందరికీ రుణమాఫీ అందే వరకు రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అందరికీ రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ తలపెట్టిన ధర్నాలకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. క్షేత్రస్థాయి నుంచి రైతులతో కలిసి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు ధర్నాల్లో కదం తొక్కి రైతు వ్యతిరేక ప్రభుత్వంపై రుణభేరి మోగించాలని ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటల నుంచే ధర్నాలు ప్రారంభం అవుతాయని, సకాలంలో తరలిరావాలని సూచించారు.

ఆలేరులో 3వేల మందితో మహాధర్నా

- పాల్గొననున్న మాజీ మంత్రి హరీశ్‌రావు
- రుణమాఫీ కాని రైతులు అందరూ తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఆగస్టు 21 : అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రుణమాఫీ రాని 3వేల మంది రైతులతో మహాధర్నాకు దిగుతున్నట్లు మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ధర్నాలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, దేశపతి శ్రీనివాస్‌తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నట్లు చెప్పారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో మీడియాతో వాళ్లు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డిసెంబర్ 9న భేషరతుగా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీనిచ్చి ఇప్పుడు మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలైనా 60 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ చెయ్యకుండా చేతులు దులుపుకొన్నారని మండిపడ్డారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సభలో రాహుల్ గాంధీ సమక్షంలో ప్రకటించిన రైతు డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. రుణమాఫీకి రూ.40వేల కోట్లు ఖర్చవుతుందని చెప్పి ఆ తర్వాత రూ. 31 వేల కోట్లు అని మాట మార్చి బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. విడుదలకు వచ్చే సరికి అది రూ.18 వేల కోట్లు అయ్యిందని దుయ్యబట్టారు.

దీనిపై రైతులకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. రుణమాఫీ మాఫీ జరుగని రైతులంతా మహాధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ బీర్ల మహేశ్, రైతుబంధు మాజీ డైరక్టర్ మిట్ట వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు అశోక్ పాల్గొన్నారు.

3 గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి, ఆగస్టు 21 : హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో మూసీకి వరద పోటెత్తుండడగా, ప్రాజెక్టు అధికారులు బుధవారం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు మూడింటిని ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. ఉదయం 843.97 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మధ్యాహ్నానికి 3,755.52 క్యూసెక్కులకు పెరుగడంతో ప్రాజెక్టు నీటి మట్టం 643.50(4.06 టీఎంసీలు)అడుగులకు చేరింది. అప్రమత్తమైన అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు 2, 7, 8 వ నెంబరు క్రస్టు గేట్లను ఒక్కో అడుగు మేర ఎత్తి 1,935.29 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కుడి కాల్వకు 168.89, ఎడమ కాల్వకు 216.86 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. నీటి విడుదల నేపథ్యంలో పరివాహక ప్రాంత ప్రజలు నదిలోకి వెళ్లొద్దని హెచ్చరించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 21: ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ ఎన్.ప్రశాంత్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తులు తీసుకుంటారని పేర్కొన్నారు. పదో తరగతిలో చేరే విద్యార్థులు ఒరిజనల్ టీసీ లేదా, జనన ధ్రువీకరణ పత్రం, కుల, ఆధార్ కార్డు జీరాక్సులు, రెండు ఫొటోలు.. ఓపెన్ ఇంటర్‌లో చేరే వారు 10 తరగతి ఒరిజనల్ మెమో, టీసీ, కుల, ఆధార్‌కార్డు జీరాక్స్, రెండు ఫొటోలు అందజేయాలని తెలిపారు. అమ్మాయిలకు కుల ధ్రువీకరణ పత్రం అవసరం లేదని, దరఖాస్తులను విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంత్ కె.జెండగే, చిత్రంలో జలశక్తి అభియాన్ బృందం, జిల్లా అధికారులు

సమన్వయంతో నీటి సంరక్షణ పనులు

- జలశక్తి అభిమాన్ బృందానికి వివరించిన కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 21 : జిల్లాలో వివిధ శాఖల సమన్వయంతో నీటి సంరక్షణ పనులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హనుమంత్ కె.జెండగే తెలిపారు. జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ ఆఫీసర్, కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ సౌరబ్ సింగ్, జలశక్తి అభియాన్ టెక్నికల్ ఆఫీసర్, కేంద్ర భూగర్భ జల శాఖ సైంటిస్ట్ ఉపేంద్ర ధోండే బృందం ఈ నెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌ను సందర్శించింది. జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు, పురోగతిని క్షేత్రస్థాయిలో బృందం పరిశీలించింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పనులు, అటవీ, వ్యవసాయం, భూగర్భ జలాలు, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల ద్వారా జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ అధికారులతో కలిసి బృందానికి వివరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా అటవీ అధికారి పద్మజ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానవ అధికారి సుభాషిణి, జిల్లా భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతికుమార్, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్, జిల్లా పశు సంవర్ధక అధికారి కృష్ణ, భువనగిరి మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, జిల్లా నీటి పారుదల అధికారి నర్సింహ, నీటిపారుదల శాఖ డీఈ ఖుర్షీద్, అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్, జిల్లా యువజన సంక్షేమ అధికారి ధనుంజయ్, వ్యవసాయ శాఖ ఏడీ నీలిమ పాల్గొన్నారు.

సారూ.. మాకు మాఫీ అయితదా..కాదా?

- వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద రైతుల క్యూ
- యాదగిరిగుట్టలో ఒక్కరోజే 120 మంది దరఖాస్తులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 21: 'సారూ మాకు రుణమాఫీ రాలేదు.. మేం ఏడాది క్రితమే లక్ష లోపు తీసుకున్నాం.. మా భార్య, కుమారుడు, నాపేరుతో రుణాలు తీసుకున్నాం. మాకు వస్తదా.. రాదా?' అంటూ రైతన్నలు వ్యవసాయాధికారి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు అధికారులకు వద్ద వెళ్తే వ్యవసాయాధికారి కార్యాలయం వద్దకు వెళ్లమంటున్నారు.. ఏ అధికారీ సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని రైతులు వాపోతున్నారు. యాదగిరి గుట్ట పట్టణంలోని వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద బుధవారం రైతులు క్యూ కట్టారు. తమకు రుణమాఫీ అమలు కాలేదని పట్టాదారు పాస్ పుస్తకంతోపాటు బ్యాంకు పాసు పుస్తకాలు తీసుకొని వచ్చారు. ఈ ఒక్కరోజే సుమారు 120 మంది రైతులు రుణమాఫీ కాలేదని దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 250 మందికిపైగా రైతులకు రుణమాఫీ కాలేదని దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఇంకా చాలా మంది రైతులు బ్యాంకులు, వ్యవసాయాధికారి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్కరోజూ కార్యాలయాల చుట్టూ తిరుగలేదని, రుణమాఫీ చేస్తామని అరిగోస పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా 11,765 రైతులుండగా వీరిలో దాదాపుగా 95 శాతం మంది రైతులు రుణమాఫీ తీసుకున్నవారిలో ఉంటారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వీరి లో కేవలం 3,844 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. మొదటి విడుతలో 1,987 మంది, రెండో విడుతలో 1,197 మంది, మూడో విడుతలో 660 మంది రైతులు రుణమాఫీ అమలైన లిస్టులో ఉన్నారని వెల్లడించారు. మిగతావారికి సాంకేతిక లోపంతో రుణమాఫీ అమలుకాలేదని తెలిపారు. రుణమాఫీ అమలుకాని రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, రుణం తీసుకున్న బ్యాంకు ఖాతా బుక్ జీరాక్స్‌లతో తమ గ్రామాల వ్యవసాయ విస్తరణాధికారులకు సమర్పించాలని సూచించారు.

యాదగిరిగుట్ట వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద రైతులు

79 వేల రుణం తీసుకుంటే మాఫీ కాలే

నాలుగేండ్ల క్రితం వ్యవసాయ అవసరాల కోసం సహకార బ్యాంకులో 79 వేలు తీసుకున్నా. మాకు 2.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రభుత్వం చెప్పిన ప్రకారం నాకు లక్షలోపు రుణమాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే మాకు వచ్చిన లిస్టుల ద్వారా రుణమాఫీ ఇస్తున్నాం.. మాకేం తెలియదని సమాధానం ఇస్తున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకు వెళ్తే ఆధార్‌కార్డులో పేరు తప్పు, రేషన్ కార్డుతోపాటు ఇతర సాంకేతిక కారణాలతో రాకపోవచ్చని అంటున్నరు. దరఖాస్తు ఇచ్చి వెళ్లమంటున్నరు. రెండ్రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. ఇప్పటి ఏ అధికారి సరైన సమాధానం చెప్పడం లేదు. రుణమాఫీ వస్తుందో రాదోనన్న అనుమానం కలుగుతుంది. రైతులను ఇలా తిప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిది కాదు.

-ఎడపెల్లి పర్వతాలు, సైదాపురం, యాదగిరిగుట్ట మండలం

కొర్రీలు ఆపి రుణం మాఫీ చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు మానేసి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకూ రెండు లక్షలు రుణమాఫీ చేయాలి. భువనగిరి సభలో లక్ష్మీనరసింహ స్వామి సాక్షిగా చెప్పిన మాట నిలబెట్టుకోవాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంట్లో ఎంతమందికి రుణం ఉన్నా మాఫీ చేసింది. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా షరతులు లేకుండా మాఫీ చేయాలి. లేకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు. మా అమ్మకు నాకు కలిసి రూ. 2.60 లక్షల అప్పు ఉంది. మా ఇద్దరికి రుణమాఫీ చేయాలి. రుణమాఫీ కోసం వ్యవసాయాధికారులకు అడిగితే పైన ఉన్న రూ. 60 వేలు కట్టినాక మాఫీ వర్తిసుదని చెప్తున్నారు. రుణమాఫీ అయితదా లేదా అర్థంకావడం లేదు.

-బిల్లకుదురు రాజు, రైతు, రాజాపేట

ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలరాజుగౌడ్

నవాబ్ పేట రిజర్వాయర్ ద్వారా చెరువులు నింపాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

గుండాల, ఆగస్టు 21 : నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా గుండాల మండలంలోని చెరువులు, కుంటలను నింపాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్ అన్నారు. తాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మండలంలో చెరువులు ఎండిపోయి బావులు, బోర్లల్లో నీళ్లు లేక వరి నాట్లు ఎండిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని చీటకోడూరు రిజర్వాయర్‌ను నింపి దాని ద్వారా నవాబ్‌పేట రిజర్వాయర్.. అక్కడి నుంచి గుండాల మండలానికి సాగు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవాదుల కాల్వల్లో చెట్లు పెరిగాయని, వాటిని తొలగించాలని అన్నారు.

అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుసుమని హరిశ్చంద్ర, మండల కార్యదర్శి రామచంద్రయ్య, రైతు సంఘం నాయకులు యాదిరెడ్డి, కొమురయ్య, సత్యనారాయణ, అంజయ్య, యేసోబు, బాలయ్య, సత్యనారాయణచారి, కృష్ణహరి, స్వామి, బక్కయ్య, భిక్షపతి, వెంకటయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

అరకొర మాఫీ చేసి చేతులు దులుపుకున్నారు

సీఎం రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలికి రైతు రుణమాఫీ అందరికీ చేస్తామని చెప్పి ఇప్పుడు కొంత మందికే చేస్తున్నాడు. రాష్ట్ర బడ్జెట్‌లో రుణమాఫీకి 31వేల కోట్లు కేటాయించగా మూడు విడుతల్లో 17వేల కోట్లను మాత్రమే ఇచ్చారు. సగం మంది రైతులకు కూడా మాఫీ చేయకుండా చేతులు దులుపుకున్నారు. మిగతా 14వేల కోట్లను రైతు రుణమాఫీకి వినియోగించకుండా తమ జేబుల్లోకి వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు.

- నల్లమాసు రమేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

మోత్కూరులో 876 మంది రైతులకుగానూ 350 మందికే మాఫీ

మోత్కూరు, ఆగస్టు 21 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ పథకంలో సాంకేతిక సమస్యలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మూడు విడుతల్లో మాఫీ చేసినా చాలా మంది రైతులకు రాలేదు. రుణమాఫీ ఎవరికి జరిగిందో, ఎవరికి జరుగలేదో తెలియని పరిస్థితి నెలకొంది. బ్యాంకు అధికారులు విడుదల చేసిన జాబితాలో మాఫీ వచ్చిన రైతుల పేర్లు మాత్రమే ఉన్నాయి. రుణాలు తీసుకున్న రైతుల పేర్లు జాబితాలో లేవు. ఈ రుణమాఫీ మొదటి నుంచి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది. తమ పేరు రుణమాఫీలో ఎందుకు రాలేదని అడిగితే వ్యవసాయ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం లేదు. ఆధార్ అప్‌డేట్, రేషన్ కార్డులో లబ్ధిదారుల పేరు లేదని చాలామంది రైతులకు రుణమాఫీ అంద లేదు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి ఏఈఓ, ఏఓ కార్యాలయాల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కానీ ఇప్పటివరకు పరిష్కారం జరుగలేదని రైతులు వాపోతున్నారు. మోత్కూరు రైతు సేవా సహకార సంఘంలో 876 మంది రైతులు రూ.4,49,97,096 పంట రుణాలు పొందారు. ఇప్పటి వరకు 350 మందికి మాత్రమే రూ.1.89 కోట్లను ప్రభుత్వం మాఫీ చేసింది. ఇంకా సంఘం ద్వారా రుణాలు తీసుకున్న 526 మందికి రుణమాఫీ జరుగాల్సి ఉన్నది.

మూడు విడుతల్లోనూ మాఫీ కాలేదు

మోత్కూరు రైతు సహకార సంఘంలో గతేడాది నవంబర్24న లక్ష రుణం తీసుకున్నా. రుణమాఫీ మొదటి విడుతలోనే మాకు మాఫీ కావాల్సి ఉండే. కానీ రెండు, మూడో విడుతలో కూడా కాలేదు. వ్యవసాయ, బ్యాంకు అధికారుల చుట్టూ అనేక సార్లు తిరిగినా ఫలితం లేకపోయింది.

-సామ సునీత, రైతు, బుజిలాపురం, మోత్కూరు

జాబితాలో నా పేరే లేదు

నేను మోత్కూరు డీసీసీబీలో లక్షా 5 వేలు పంట రుణం తీసుకున్న. ప్రతి ఆరు నెలలకు తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించిన. ఇప్పుడు ప్రభుత్వం మూడు సార్లు చేసిన రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. పీఏసీఎస్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఏం చెప్పడం లేదు. బ్యాంకుకు పోతే మరో జాబితాలో వస్తది ఆగమన్నారు. తిరిగి తిరిగి వేసారినా ఫలితం లేదు. ఏఓకు ఫిర్యాదు చేయమంటే దరఖాస్తు ఇచ్చిన.

-అంబటి చిన్న నర్సయ్య, రైతు, కొండగడప, మోత్కూరు

ఇప్పుడే మోసం చేయవట్టిరి

కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పే లెక్కలకు ఆచరణలో జరిగే దానికి పొంతన లేద